# మలయ మారుతం

**-ముడార్ వేణు**

ప్రయాణ బడలికతో, చల్లటి గాలికి బయట పడుకున్న నాకు హాయిగా నిద్ర పట్టేసింది. సరిగ్గా ఆరుగంటల ప్రాంతంలో శ్రావ్యమైన సంగీతానికి మెలకువ వచ్చింది. ప్రశాంత వాతావరణం, నాకిష్టమైన అన్నమయ్య గీతాలాపన వింటూ తన్మయత్వంతో అలాగే పడుకున్నాను.

కొంతసేపటికి 'బాబాయి పిలుపుతో లేచి కూర్చున్నాను.

"ఏమోయ్ ప్రభూ! లేచి తొందరగా రెడీ కావాలి. తొమ్మిదింటికి ఇంటర్వ్యూ వుందన్నావుగా" అంటుంటే బాబాయ్‌మీద కోపం వచ్చింది. సంగీత ఝరిలో ఓలలాడుతున్న నా ఏకాగ్రతను భగ్నపరిచినందుకు విసుక్కున్నాను మనస్సులోనే.

"బాబాయ్! ఎవరింట్లో ఆ సంగీత సాధన?" అంటూ ప్రశ్నించాను.

"ఆ సంగీతం వింటూ హాయిగా పడుకున్నావన్నమాట. మన ఎదురింట్లో విశ్వనాథంగారని మంచి సంగీత విద్వాంసులు ఉన్నారు. ఆయన ఇంట్లో ప్రతి ఒక్కరూ సంగీతంలో నిష్ణాతులే. అతని కూతురు రాధ పాడుతుంటే రాళ్లయినా కరుగుతాయి. అప్పుడప్పుడు కచేరీలు చేస్తుంటారు. సంగీత పాఠాలు చెబుతుంటారు. నీవు త్వరగా తయారవు" అంటూ వెళ్లిపోయాడు.

నాకు సంగీతం రాకపోయినా వినడంలో మంచి ఆసక్తి ఉంది. ఎక్కడైనా సంగీత సభలు జరిగినా తప్పనిసరిగా హాజరవుతాను. సాంప్రదాయ సంగీతమే కాకుండా లలిత జానపదాల్ని కూడా ఎంతో తన్మయత్వంగా వింటూ ఉంటాను. కానీ ఈ ఉదయం విన్న పాటలు నా మనస్సును ఆకట్టుకుంది.

ఇంటర్వ్యూ ముగించుకుని సాయంత్రం నాలుగు గంటలకు ఇల్లు చేరాను. పిన్ని వేడివేడిగా బజ్జీలు చేసి పెట్టింది. బాబాయి ఏదో కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. ఒక్కడే కొడుకు. ఢిల్లీలో ఉద్యోగం. వాడికి పెళ్లయి అక్కడే ఉన్నాడు.

బాబాయి ఆరుగంటలకు వచ్చాడు. వస్తూనే "ప్రభూ! ఇంటర్వ్యూ ఏమైంది?" అంటూ ప్రశ్నించాడు.

"వారంరోజుల్లో తెలియజేస్తామన్నారు బాబాయ్. ఇంటర్వ్యూ బాగానే జరిగింది. పైరవీలులాంటివి లేకుండా ఉంటే నాకు ఉద్యోగం రావచ్చు" అన్నాను.

"ఎలాగూ వచ్చావు. ఓ వారం పదిరోజులుండి ఈ విశాఖ పరిసరాలన్నీ చూసి వెళ్లు. అరకు, బుర్రా గుహలు, సింహాచలం, షిప్‌యార్డ్ అన్నీ చూడదగ్గ ప్రదేశాలే."

ఆయన మాటలు పూర్తి కాకుండానే పిన్ని అందుకుంది.

"పదిరోజులకేం ఖర్మ. ఓ నెలరోజులు ఉండనివ్వండి. నేను వెంట వెళ్లి ఇంకా శ్రీకాకుళం దగ్గర శ్రీకూర్మం, అరసవెల్లికూడా చూపించుకుని వస్తాను" అంటూ ఉత్సాహంగా చెప్పసాగింది.

"సరే...సరే...నాన్నగారు తిరిగి రమ్మని కబురు పంపేదాకా ఇక్కడే ఉంటాను" అంటూ సమాధానం చెప్పాను.

రాత్రి భోజనాలయ్యాక "బాబాయ్! విశ్వనాథంగారిని పరిచయం చేస్తానన్నావు మర్చిపోయావా?" అంటూ గుర్తు చేసాను.

"అవును మర్చేపోయాను. నీకు సంగీతమంటే మరీ అంత మక్కువన్నమాట. పోదాం పద" అంటూ లేచాడు.

విశ్వనాథంగారు అప్పుడే భోజనం ముగించుకుని తాంబూల సేవనలో నిమగ్నమయ్యారు. బాబాయిని చూస్తూనే "రండి రమేషంగారూ రండి" అంటూ ఆహ్వానించారు. నావైపు ప్రశ్నార్థకంగా చూడడం గమనించిన బాబాయి-

"మావాడేనండీ. వరుసకు కొడుకవుతాడు. ఏదో ఉద్యోగానికి ఇంటర్వ్యూ ఉందని వచ్చాడు. ఉదయం మీ సంగీతం విన్నాడు. వాడి ఆనందానికి అవధుల్లేవు. అందుకే మీకు పరిచయం చేద్దామని పిల్చుకుని వచ్చాను" అన్నారు.

"చాలా సంతోషమండీ. మా అమ్మాయిని పిలుస్తానుండండి" అంటూ "అమ్మా రాధా! ఇలా రామ్మా" అని పిలిచారు.

"ఏం నాన్నా!" మృదుమధుర కంఠం వినిపించింది. ఆమె ఎలా వుంటుందో చూడాలనే తపన నాలో ఎక్కువైంది. మెల్లగా కదలివస్తున్న అందమైన బాపు బొమ్మలా ఉన్న ఆ అమ్మాయిని అలాగే కళ్లార్పకుండా చూడసాగాను.

"బాగున్నారా అంకుల్?" అంటూ బాబాయిని పలకరించింది. కొత్త వ్యక్తినైన నన్ను చూసి కాస్త సిగ్గుపడి తల వంచుకుంది.

"చూడమ్మా రాధా! వీడు మా అబ్బాయి. సంగీతమంటే చెవి కోసుకునే రకం. ఉదయం నీ పాటలు వింటూ మైమరచిపోయాడంటే నమ్ము. అందుకే మీకు పరిచయం చేద్దామని తీసుకువచ్చాను" అంటూ బాబాయి చెబుతుంటే తదేకంగా తన్నే చూస్తున్న నా చూపులనుండి తప్పించుకుంటూ-

"మజ్జిగ తెస్తానుండండి" అంటూ లోపలకు పరుగుతీసింది.

***

బాబాయ్ తనకు ఆఫీసులో పని వుందంటూ పిన్నిని తోడిచ్చి సింహాచలం, అరకులోయ, బుర్రా గుహలు చూపించమన్నాడు. నాలుగురోజులపాటు అవన్నీ తిరిగి వచ్చాం.

ఆ మరుసటిరోజు విశ్వనాథంగారు వారింటికి భోజనానికి పిలిచారు. భోజనాల తరువాత సంగీత సభ ఏర్పాటు చేసారు. ఆయన పెద్ద కూతురు శ్యామల వీణా వాయిద్యాన్ని, కొడుకు శేఖర్ ఫిడేలు, శిష్యుడు గోటు వాయిద్యంతో కూర్చున్నారు. విశ్వనాథంగారు త్యాగరాజ కృతిని పాడుతుంటే వాయిద్యాలు మృదుమధురంగా పలుకుతుంటే ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాను. తరువాత రాధ తన కోయిల కంఠంతో



పురందరదాసు కీర్తనలు, అన్నమయ్య పదాలు పాడుతూ నన్ను మైమరచిపోయేలా చేసింది. సంగీత సరస్వతి ఆ ఇంట గజ్జెకట్టి నాట్యం చేస్తోందా అనిపించింది. ఆ మధుర గానవాహినిలో మునిగిపోయిన నేను చాలాసేపటివరకూ ఈ లోకంలోకి రాలేకపోయాను.

"విశ్వనాధంగారూ! నేను సంగీతం విని ఆనందించగలవాడినేగానీ అందులో ఏ విధమైన జ్ఞానంలేనివాడ్ని. మీరు చాలా అదృష్టవంతులు. కుటుంబం మొత్తం ఈ కళకు అంకితమయ్యారు. నాకు మీతో పరిచయం చాలా సంతోషదాయకంగా ఉంది" అన్నాను. ఈ మాటలు అంటున్నప్పుడు నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"ఏం అదృష్టం బాబూ. ఇదే మా బ్రతుకుతెరువైంది. మమ్మల్ని సరస్వతి కరుణించిందిగానీ లక్ష్మీదేవి మా దరిదాపులకు రాదు. దారిద్ర్యం, దురదృష్టం మమ్మల్ని వెన్నంటి ఉన్నాయి" అన్నారు బాధగా.

***

విశ్వనాధంగారు ఆర్థిక బాధల్లో ఉన్నారా పిన్నీ?" అని అడిగాను.

"ఆయన చాలా దురదృష్టవంతుడు. భార్య పోయింది. పెద్దకూతురికి పెళ్లి చేసాడు. రెండేళ్లు కాపురం చేసింది. భర్త మరణించాడు. శ్యామల పుట్టింటికి చేరింది. ఇక కొడుకు శేఖర్‌కు మాటలు రావు. పుట్టుకతో మూగవాడు. పాపం అన్నీ కష్టాలే. పాఠాలు చెప్పి ఎప్పుడో అప్పుడు చేసే కచేరీలతో వచ్చే ఆదాయంతోనే ఆయన బతుకు బండి లాగిస్తున్నాడు" అంటూ ఆమె చెబుతుంటే నాకు ఎంతో బాధనిపించింది.

***

ఒకరోజు విశ్వనాధంగారితో మాట్లాడుతూ "ఈ సినిమాలు, టీవీలు వచ్చిన తరువాత సాంప్రదాయ సంగీతానికి విలువ తగ్గిపోయిందని అంటుంటారు నిజమేనా?" అని ప్రశ్నించాను.

దానికాయన నవ్వుతూ "అదేంలేదు బాబూ! నేను పంచె కట్టుకుంటాను. ఇది సాంప్రదాయకం. మీరు ప్యాంటు తొడుగుతున్నారు. ఇటు సాంప్రదాయకపు దుస్తులు, అటు ఆధునిక దుస్తులు రెండూ సమానంగానే వాడుకలో ఉందికదా. అలాగే సినిమాలు, రేడియోలు, టీవీలవల్ల సాంప్రదాయ సంగీతం అంతరించిపోతోందనడం సరికాదు. దేన్ని ఆదరించేవారు దానికున్నారు" అంటూ జవాబిచ్చారు.

ఈ సత్యాన్ని మరో రెండురోజుల్లో నేను తెలుసుకోగలిగాను. విజయనగరం కళామందిరంలో విశ్వనాధంగారి సంగీత విభావరికి ప్రేక్షకుడిగా, శ్రోతగా హాజరైనాను. అక్కడి జనాన్ని చూసి నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. అంతరించిపోతోందని ఏ శాస్త్రీయ, సాంప్రదాయక సంగీతాన్నయితే కొందరనుకుంటూ ఉంటారో అదే సంగీతానికి శ్రోతలు కొన్నివేలమంది హాజరుకావడం ప్రతి పాటకు హర్షధ్వానాలు తెలపడం నన్ను పులకింపజేసింది.ఈ పదిరోజుల్లో విశ్వనాధం కుటుంబానికి మరింత దగ్గరయ్యాను. రాధ, శ్యామల నాతో చనువు పెంచుకున్నారు. పాపం శేఖర్ తన మూగ భాషతో తన భావాల్ని వెల్లడించేవాడు. ఎప్పుడూ చలాకీగా తిరుగుతుండేవాడు.

రాధ, నేను ఎన్నో విషయాలు చర్చించుకునేవాళ్లం. నేనెప్పుడైనా సంగీతం గురించి మాట్లాడితే "బాబూ! ఈవిషయం తప్ప మరేదీ నీకు తట్టదా? మీ కుటుంబ వివరాలు చెప్పు ఆసక్తిగా వింటాను" అనేది.

"మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు. మేం ఇద్దరం అన్నదమ్ములం. మా అన్నయ్య రమణ నాకంటే మూడేళ్లు పెద్ద. ఇద్దరు చెల్లెళ్లు. చెల్లెళ్లకింకా పెళ్లికాలేదు. మేమిద్దరం నిరుద్యోగులం. అమ్మ పాతకాలపు మనిషి. చాదస్తం ఎక్కువ. ఎప్పుడూ పూజలు, వ్రతాలతో కాలం గడుపుతుంది. ఆడపిల్లల పెళ్లిళ్లు కాలేదని ఎప్పుడూ దిగులుగా వుంటుంది."

మా కుటుంబం గురించి చెప్పాను.

"అందరివీ బాధలే. ఒకరి బాధకీ మరొకరి బాధకీ తేడాలుంటాయి"

***

"ఏరా ! రాధ నీపైన బాగా ఇష్టం పెంచుకున్నట్లుంది. మీరిద్దరూ ప్రేమించుకుంటున్నారా?" అంటూ భోజనాల దగ్గర ప్రశ్నించింది పిన్ని.

"అబ్బే అటువంటిదేమీలేదు పిన్నీ" అన్నాను.

ఆ రాత్రి పడుకున్నానేగానీ ఎంతసేపటికీ నిద్ర పట్టలేదు. 'నేను రాధను ప్రేమిస్తున్నానా? రాధ నన్ను ఇష్టపడుతోందా? అయినా ఆ అమ్మాయి నన్ను చేసుకుని ఏం సుఖపడుతుంది? పుట్టినప్పటినుంచీ కష్టాల్లోనే పెరిగింది. అందులోనూ ఇద్దరు చెల్లెళ్లకు పెళ్లిళ్లు కావాలి. నాకు, అన్నయ్యకు ఉద్యోగాలు రావాలి. మేమిద్దరం ఎవరి కాళ్లమీద వాళ్లు నిలబడాలి. అంత వరకూ నా పెళ్లి గురించి ఆలోచించడానికి వీల్లేదు. రాధ ఎవ్వరైనా మంచి శ్రీమంతుడిని పెళ్లాడడంవల్ల ఇన్నాళ్లు తాను అనుభవించిన ఈతిబాధల నుండి బయటపడగలదు. ఆమె శ్రేయోభిలాషిగా నేను అదే కోరుకుంటాను.

కానీ నాకు రాధపైన అవ్యాజమైన ప్రేమ, పైకి చెప్పుకోలేని బాధ కూడా దాగి ఉంది. రాధ మనసులో నాపట్ల ఎటువంటి అభిప్రాయం ఉందో తెలియదు. నాతో చాలా చనువుగా వుంటుంది. ఆమెకు సంగీత ప్రపంచమే తప్ప చెప్పుకోదగిన స్నేహితులు లేనందున నన్నో స్నేహితుడిగానే తలచి అరమరికలు లేకుండానే నాతో చనువుగా వుంటోందా? అన్నీ ప్రశ్నలే.'

నాన్నగారి నుండి తిరిగి రమ్మని రెండు కబుర్లు అందాయి. ఇక నేను బయలుదేరక తప్పలేదు. ఈ పదిహేనురోజుల్లో విశ్వనాధం కుటుంబంతో ముఖ్యంగా రాధతో ఏర్పడిన అనుబంధం నన్ను కట్టిపడేస్తోంది. కానీ తప్పదు... బయలుదేరాల్సిందే. ఇప్పటికే పిన్నికి, బాబాయికి మా ఇద్దరి పట్ల ఎన్నెన్నో సందేహాలు కలుగుతున్నాయి.

"ప్రభూ! రాధను గాఢంగా ప్రేమిస్తున్నావుకదూ. పెళ్లి చేసుకుంటావేమో చూడు. మీ నాన్నగారికి ఉత్తరం రాసి ఆయన్ని ఒప్పిస్తాం" అంది.

"ఛ...ఛ...అలాంటిదేంలేదు పిన్నీ. నాకు, రాధకు మధ్య అటువంటిదేమీ లేదు. మేమిద్దరం మంచి స్నేహితులం అంతే. అయినా తాదూర సందు లేదు, మెడకో డోలు అన్నట్లు నాకు ఠికానా లేనప్పుడు పెళ్లాడి ఇద్దరం జీవితాంతం బాధపడాలి" అంటూ జవాబు చెప్పాను.

"కాదోయ్... మీరిద్దరు ఒకరికొకరు చక్కగా ఈడుజోడుగా కనబడతారు. అందులో నీపట్ల విశ్వనాధంగారికి మంచి అభిప్రాయముంది. మొన్న ఆయన మీ కుటుంబం గురించి వివరాలు మీ బాబాయిని అడిగి తెలుసుకుంటున్నారు. అందుకనే అడిగాను" అంటూ చెప్పుకొచ్చింది.

"పిన్నీ! మా గురించి నీకు బాగా తెలుసు. మా అన్నయ్య, మా చెల్లెళ్లు మొత్తం ముగ్గురికి మొదట వివాహాలు జరగాలి. అన్నయ్య జీవితంలో స్థిరపడాలి. తర్వాత నాకేదైనా ఉద్యోగం వచ్చి ఒకరిమీద ఆధారపడకుండా జీవించగలిగినప్పుడే పెళ్లి గురించి ఆలోచిస్తాను" అన్నాను.

మరుసటిరోజే నా తిరుగు ప్రయాణం. రాత్రి విశ్వనాధంగారింటికి భోజనానికి పిలిచారు. భోజనాల తరువాత నాకిష్టమైన మలయమారుత రాగంలో కొన్ని త్యాగరాజ కీర్తనలను రాధ పాడుతుంటే వీళ్లని, వీరి మధుర గానాల్ని వదిలిపోతున్నాననే ఊహతో గుండె బరువుతో కళ్లు చెమర్చాయి.

***

ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. చివరికి డిఫెన్స్‌లో గుమస్తాగా ఎంపికయ్యాను. కాశ్మీర్‌లో జాయినయ్యాను. నాలుగేళ్లు అక్కడ ఉద్యోగ బాధ్యతల్ని నిర్వహించిన తరువాత బెంగుళూరుకు బదిలీ అయ్యాను. అక్కడ ఉన్నన్ని రోజులూ రాధే నా హృదయంలో మెదిలేది. బాబాయికి తరచుగా ఉత్తరాలు రాసేవాడిని. అందులో విశ్వనాధంగారి గురించి తప్పనిసరిగా వాకబు చేసేవాడిని. బాబాయినుండి ఎప్పుడోగానీ జవాబు వచ్చేదికాదు. చాలా దూరంలో ఉన్నావు. ఆరోగ్యం జాగ్రత్త అని తప్ప మిగతా ఏమీ ఉండేదికాదు.

అప్పటికి అన్నయ్య ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరడం, చెల్లెళ్లిద్దరికీ పెళ్లిళ్లు కావడం జరిగిపోయింది. ఎక్కువ సెలవులు దొరకనందున మూడు నాలుగు రోజులు పెళ్లిళ్లకు హాజరై వెళ్లిపోయేవాడిని. అన్నయ్యకు పిల్లని చూస్తున్నామని, అలాగే నాక్కూడా అమ్మాయిని వెదుకుతున్నామని నాన్నగారు ఉత్తరం రాసారు. ఎలాగూ నేను నా కాళ్లపై నిలబడుతున్నాను. అందులోనూ ముప్పై ఏళ్ల వయస్సు దగ్గర పడుతోంది. కాబట్టి పెళ్లాడాలనే వాంఛ నాలో బలంగా ఏర్పడింది. ఇప్పుడే రాధ నా మనసులో మెదలసాగింది.


## వేరే తల్లులకి పుట్టిన కవలలు

లండన్‌కి చెందిన 40 ఏళ్ళ అమీ బెర్నబాకి 15 ఏళ్ళ కొడుకున్నాడు. వాడికి తమ్ముడినో, చెల్లెలినో కనివ్వాలని 12 ఏళ్ళుగా 'ఫెర్టిలిటీ ట్రీటుమెంటు' చేయించుకున్న అమీ కొన్నాళ్ళక్రితం గర్భవతి అయింది. ఈ మాటు ఒక్కరుకాదు కవలలు పుట్టే అవకాశముందని, అయితే ఇద్దరు బిడ్డల్ని కనగలిగే దారుఢ్యం ఆమెకి లేదని డాక్టర్లు చెప్పారు. అమీ గర్భంలోని ఒక పిండాన్ని అలాగే ఉంచి, రెండో పిండాన్ని సరోగేట్ (గర్భాన్ని ఎరువిచ్చిన) తల్లి టోరోకియే గర్భంలోకి బదిలీ చేసారు డాక్టర్లు. ఇటీవల ఇద్దరూ కొన్ని క్షణాల తేడాతో ఇద్దరు ఆడపిల్లల్ని కన్నారు. ప్రపంచంలో వేరే గర్భాల నుంచి పుట్టిన మొదటి కవలలు వీరే! ఇప్పుడా పిల్లల తల్లిదండ్రుల ఆనందం వర్ణనాతీతం!

## కోతులకి 5-స్టార్ విందు

థాయ్‌లాండ్‌లోని లోబూరీ టౌన్లో ఇటీవల ఏన్యువల్ మంకీ ఫెస్టివల్ నాడు ఒక పురాతన మందిరానికి ఎదురుగా అనేకరకాల పళ్ళతో బఫే 5 స్టార్ విందుని ఇచ్చారుట! 20 మంది వంటవాళ్ళు కలర్‌ఫుల్‌గా అరేంజ్ చేసిన ఈ విందు ఖరీదు 15 వేల డాలర్లు. వేలాదిమంది ఆ పండుగలో పాలుపంచుకున్నారుట. దీనివల్ల టూరిజం అభివృద్ధి చెందుతోందని ఆ ఊరివారు కోతులకి థేంక్సు చెప్పుకుంటున్నారుట!

-విమలారామం



నా సంగీత సరస్వతి ఎలాగుందో? ఈపాటికి పెళ్లయిపోలేదుకదా! ఎలాగైనా విశాఖపట్నం వెళ్లి ఒకసారి నా రాధను చూసి రావాలి. ఆమెను ఎలాగైనా వివాహానికి ఒప్పించాలి. అతి కష్టంమీద ఎనిమిదిరోజుల సెలవుపై విశాఖ బయలుదేరాను. దారి పొడవునా రాధ జ్ఞాపకాలే. రాధతో గడిపిన మధురక్షణాలే. ఆమె తన కోకిల కంఠంతో పాడిన పాటలే పదేపదే గుర్తుకు వస్తున్నాయి.బాబాయి, పిన్ని సాదరంగా ఆహ్వానించారు. ఆ మధ్యాహ్నం తీరిగ్గా కూర్చుని కబుర్లాడుకుంటూ నా ఉద్యోగం గురించి వారికి వివరించాను. విశ్వనాధం గురించి అడగాలని ప్రయత్నిస్తుండగా పిన్ని చెప్పింది.

"విశ్వనాధంగారు ఇల్లు మారారు. సీతమ్మధారలో ఓ చిన్న ఇంట్లో చేరి ఏడాదిపైగా అయింది'' అంది.

"రాధకు పెళ్లయిందా పిన్నీ'' అన్నాను. నా కంఠంతో ఆతృత నాకే స్పష్టంగా వినిపించింది.

"ఇంకాలేదు. సాయంత్రం మీ బాబాయిగారి వెంట వాళ్ల ఇంటికి వెళ్లిరా'' అంది ముక్తసరిగా.

***

సాయంకాలం బాబాయి వెంట విశ్వనాధంగారింటికి వెళ్లాను.

"రండి...రండి... రాధా! ఎక్కడున్నావ్ తల్లీ! రామ్మా'' అంటూ పిలిచారు.లోపలినుండి వచ్చిన రాధను చూసి నా గుండె తరుక్కుపోయింది. ముతక చీరతో, విషాద వదనంతో వున్న రాధ నిజంగా ఆమె ఆనాటి రాధేనా అంటూ తదేకంగా చూడసాగాను.

"రాధా! బాగున్నావా!'' అంటున్న నాకు ఆమె జవాబు చెప్పకుండా ఉబికి వస్తున్న కన్నీళ్లతో మౌనంగా నిలబడింది.

విశ్వనాధంగారు గట్టిగా ఏడుస్తూ చెప్పారు.

"మా అమ్మాయి కంఠం మూగబోయింది బాబూ. ఆ దేవుడు శపించి మధురమైన ఆమె గళాన్ని హరించాడు.''నా నెత్తిన పిడుగు పడినట్లయింది. ఎంత ఘోరం జరిగింది. రాధను హత్తుకుని ఊరడించాలని, విశ్వనాధంగారిని సముదాయించాలని ప్రయత్నిస్తున్న నాకు అసలు మాట రాలేదు.

వారుంటున్న ఇల్లు చాలా పాతది. అద్దె తక్కువని అక్కడ చేరారుట. ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. వయసుపైబడిన విశ్వనాధంగారు కొంత మందికి సంగీత పాఠాలుచెప్పి సంపాదిస్తున్న దాంట్లోనే సంసారం నడుపుతున్నారు. రాత్రి బాబాయితో, పిన్నితో నేను రాధను పెళ్లాడతానని, మా నాన్నను ఈ విషయంలో ఒప్పించాల్సిన బాధ్యత వారిదేనంటూ కరాఖండిగా చెప్పేసాను.మరుసటిరోజు ఉదయం ఇదే విషయాన్ని విశ్వనాధంగారికి చెప్పి రాధ అభిప్రాయం తెలుసుకోవాల్సిందిగా కోరాను.

"బాబూ! ఆవేశంతో, మామీద సానుభూతితో ఈ నిర్ణయం తీసుకుని వుంటావు. బాగా ఆలోచించుకో. ఇది జీవితానికి సంబంధించినది. మీవాళ్లందరూ దీనికి అంగీకరించాలి. మూగపిల్లను కోడలుగా తెచ్చుకోవడానికి మీ తల్లిదండ్రులు ఇష్టపడాలి'' అంటూ విశ్వనాధంగారు తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

"చూడండి! నేను సానుభూతితో ఈ నిర్ధారణకు రాలేదు. పరిపూర్ణమైన ప్రేమతోనే రాధను చేపట్టడానికి తీర్మానించుకున్నాను. ఎవరు అంగీకరించినా అంగీకరించకపోయినా రాధను నేను పెళ్లాడతాను''

రాధ ఎలా తన కంఠస్వరాన్ని కోల్పోయిందో విశ్వనాధంగారు వివరించారు. గత ఏడాది తరచూ గొంతు నొప్పితో బాధపడుతున్న రాధను డాక్టర్లు పరీక్షించి స్వరపేటికకు క్యాన్సర్ సోకిందని, ప్రాథమిక దశలో ఉన్నందువల్ల స్వరపేటిక తొలగిస్తే క్యాన్సర్ ఇతర భాగాలకు వ్యాపించకుండా ప్రాణహాని నుండి తప్పించవచ్చని అన్నారు. రాధ స్వరపేటిక తొలగించుకోవడానికి సుతరామూ అంగీకరించలేదని, ప్రాణం పోయినా ఫర్వాలేదుగానీ తన కంఠం మాత్రం మూగపోరాదంటూ మొండికేసిందని, చివరికి ఎలాగో దానికి నచ్చచెప్పి ఆపరేషన్ చేయించామని చెప్పారు. రాధ పాడిన పాటలన్నిటినీ రికార్డు చేసి కాసెట్లు భద్రపరచిన తరువాతే ఆపరేషన్ చేయించినట్లు ఆయన చెప్పారు.

మా బాబాయి, పిన్ని మొదటగా నా ప్రతిపాదన పట్ల హర్షం వ్యక్తపరిచారు. ఈ విషయంలో మా అమ్మా నాన్న నుండి పూర్తి వ్యతిరేకత వ్యక్తమైంది. నేను నా స్థిర నిర్ణయాన్ని ప్రకటించిన తరువాత వారు అంగీకరించక తప్పలేదు.

రాధ కంఠం మూగదైనా ఆమె హృదయం మాత్రం ప్రేమ నిండిన కాసారంగా నాకిప్పటికీ అనిపిస్తోంటుంది. ఆమె పాడినపాటలు కేసెట్లలో వింటూ మేమిద్దరమే కాకుండా మా ఇద్దరు పిల్లలు కూడా ఆనందిస్తుంటారు.

★



## అర్థంలేని ప్రచారం

హంసిక బాలీవుడ్ యువ హీరో అఫ్తాబ్‌తో ప్రేమలో పడిందనే వార్తలు జోరుగా ప్రచారంలోకి వచ్చాయి. దాంతో చిన్నపిల్లయినా పెద్దగా రెస్పాండ్ అయింది హంసిక. 'అసలేంటిదంతా? ప్రేమించేంత పెద్ద వయసు నాకు ఇంకా రాలేదు. నేనింకా చిన్నపిల్లను. పైగా వయసులో నాకన్నా వయసులో ఎంతో పెద్దయిన అఫ్తాబ్ లాంటి వాళ్లతో నాకు లింకులు పెడుతున్నారు. ఇదంతా కొంతమంది పనిలేని వాళ్లు చేస్తున్న ప్రచారం' అంటూ కొట్టి పారేసింది హంసిక.

